సాక్షి రంగారెడ్డి

సోమవారం । 26 । ఆగస్టు । 2024



నిధుల గండం

గ్రామ పంచాయతీలను నిధుల గండం వెంటాడుతోంది. చిన్నపాటి పనికి కూడా తంటాలు తప్పడం లేదు. 8లో▸



అండగా నిలవాలి

తలసేమియా వ్యాధిగ్రస్తులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. 8లో▸



దొరికితేనే దొంగ!

జీఎస్టీ లేకుండా ఆయా సరుకులతో వాహనాలు రోడ్డెక్కుతున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నాయి. 8లో▸

రేపు చేవెళ్ల ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో ఫోన్ ఇన్

గ్రామాలు, పట్టణాల్లో విషజ్వరాలు, డెంగీ, చికున్‌గున్యా తదితర సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఆస్పత్రులకు బాధితులు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై ఫోన్ ఇన్ ద్వారా చేవెళ్ల ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ సలహాలు, సూచనలు ఇస్తారు.





అంశం: విషజ్వరాలు, డెంగీ, చికున్‌గున్యా తదితర సీజనల్ వ్యాధులు
డాక్టర్: రాజేంద్రప్రసాద్, చేవెళ్ల ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్
తేదీ: 27-08-2024 (మంగళవారం)
సమయం: ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్:
99492 61512

న్యూస్‌రీల్

నేరాలపై నజర్

- ఉక్కుపాదంతో అణచివేస్తాం
- డీసీపీ సునీతా రెడ్డి



రోహింగ్యాలకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీసీపీ సునీతా రెడ్డి

పహాడీషరీఫ్: బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుసగా కొనసాగుతున్న నేరాలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. తరచూ హత్యలు, హత్యాయత్నాలు జరుగుతుండడం..గంజాయి సరఫరా లాంటి విషయాలు వెలుగుచూస్తుండడంతో మహేశ్వరం డీసీపీ డి.సునీతా రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం రాయల్ కాలనీలో కార్డన్ సెర్చ్ చేపట్టారు. అదనపు డీసీపీ బి.వి.సత్యనారాయణ, ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ టి.భూపతి, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ పి.గురువారెడ్డితో పాటు సీఏఆర్ హెడ్ క్వార్టర్స్, ఎస్‌వోటీ పోలీసులతో మొత్తం 287 మంది కలిసి ప్రత్యేక టీమ్‌లుగా ఏర్పడి ఇంటింటి సోదాలు నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 63 వాహనాలు, మూడు బాటిళ్ల ఆక్సిటోసిన్ స్టెరాయిడ్ (గేదెలు అధికంగా పాలు ఇచ్చేందుకు వినియోగించే ఉత్ప్రేరకం)లను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు రౌడీషీటర్లు, ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ముఖ్యంగా రోహింగ్యా ముస్లిం యువకులకు ఇక్కడి నిబంధనలు పాటిస్తూ నేరాలకు దూరంగా ఉండాలని డీసీపీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్న ఈ రోజుల్లో కొంత మంది యువత మాదక ద్రవ్యాలకు బానిసలై నేరాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకపై స్టేషన్ పరిధిలో 24 గంటల పాటు పెట్రోలింగ్ కొనసాగిస్తామన్నారు. నేరాలకు పాల్పడే వారిని ఉక్కుపాదంతో అణచివేస్తామని హెచ్చరించారు. స్థానిక పౌరులు కూడా అనుమానాస్పదంగా సంచరించే వారి సమాచారం ఇవ్వాలని ఆమె సూచించారు.

పోలీసుల ప్రతిష్ట పెంచాలి

తెలంగాణ రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం



సాక్షి, సిటీబ్యూరో: సమాజంలో మర్యాదగా మెలగాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, పోలీసుల ప్రతిష్టను ఇనుమడింపజేయాలని తెలంగాణ రిటైర్డ్ పోలీస్ అధికారుల సంఘం పిలుపునిచ్చింది. ఆదివారం సంఘం వార్షిక జనరల్ బాడీ సమావేశం మాసబ్‌ట్యాంకు వద్ద జరిగింది. సమావేశానికి చైర్మన్ భాస్కర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ నవీన్‌చంద్, సీనియర్ రిటైర్డ్ ఐపీఎస్ అధికారులు అప్పారావు, ఎస్ఎస్‌పీ యాదవ్ కమల్ కుమార్, రతన్, ప్రభాకర్‌రెడ్డి, రాజేందర్ డీజీ, గోపాల్‌రెడ్డి డీజీ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 75 ఏళ్ల వయసు దాటిన వారిని సత్కరించారు.

కనెక్షన్.. కలెక్షన్!



కరెంటోళ్లకు కాసులు కురిపిస్తున్న కొత్త కనెక్షన్లు

- ఒక్కో పనికి ఒక్కో రేటు 'ఫిక్స్'
- ఇస్తే సరి లేదంటే ముప్పుతిప్పలు
- తరచూ ఏసీబీకి పట్టుబడుతున్న అధికారులు
- అయినా ఆగని అక్రమ వసూళ్లు

ఏ పనికి ఎంత వసూలు చేస్తున్నారంటే.. (సుమారు)

రిజిస్టర్డ్ డాక్యుమెంట్ ఉన్న ఇంటికి ఒక్కో మీటర్‌కు రూ.**1,500-2,000**

నోటరీ ల్యాండ్/ ఇంటి కనెక్షన్‌కు రూ.**10,000-20,000**

లైన్ షిఫ్టింగ్‌కు రూ.**15,000-20,000**

కొత్తలైను ఏర్పాటుకు రూ.**40,000-50,000**

ప్యానల్‌బోర్డు అనుమతికి రూ.**55,000-60,000**

బహుళ అంతస్తుల భవనానికి 63 కేవీఏ డీటీఆర్ మంజూరుకు రూ.**1,80,000-2,00,000**

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కొత్తలైన్లు, లైన్ షిఫ్టింగ్ పనులు, మీటర్లు, డీటీఆర్‌లు, ప్యానల్ బోర్డులు కరెంటోళ్లకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. నిబంధనల మేరకు లోడును బట్టి ఫీజులు చెల్లిస్తున్నా.. క్షేత్రస్థాయిలోని ఆర్టిజన్లు, జూనియర్ లైన్‌మెన్లు, ఏఈ, ఏడీఈ, డీఈ ఇలా ఎవరి స్థాయిలో వారికి చేయి తడపనిదే ఏ మాత్రం పని కావడం లేదు. నిరాకరించిన వారిని ముప్పుతిప్పలు పెడుతున్నారు. అధికారుల తీరుతో విసుగుచెందుతున్న వినియోగదారులు చేసేది లేక చివరికి ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. తరచూ ఏదో ఒకచోట.. ఎవరో ఒకరు ఏసీబీకి పట్టుబడుతూనే ఉన్నారు. అయినా.. అక్రమార్కుల వైఖరిలో మాత్రం మార్పు రావడం లేదు.

వేతనం బోలెడు.. అయినా వదలరు

వాస్తవానికి ఇతర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలతో పోలిస్తే డిస్కం ఇంజనీర్ల వేతనాలు చాలా ఎక్కువే. ఒక్కో డీఈకి సీనియార్టీని బట్టి నెలకు రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వేతనం చెల్లిస్తుంది. సీనియర్ లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్ల వేతనాలు కూడా రూ.లక్షకు పైమాటే. ప్రభుత్వం వీరికి భారీగా వేతనాలు చెల్లిస్తున్నప్పటికీ.. వీరిలో కొంతమంది అడ్డదారులు తొక్కుతున్నారు. ప్రతి పనికీ ఓ రేటు ఫిక్స్ చేస్తున్నారు. ఎక్కడా లేని విధంగా ఫోకల్, నాన్ ఫోకల్ అనే పేరుతో పోస్టులను సృష్టించి పోస్టింగ్ కోసం చేసిన ఖర్చులను తిరిగి రాబట్టుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. అక్రమ సంపాదనకు అలవాటు పడి అవినీతి నిరోధకశాఖ వలలో చిక్కుతున్నారు. ప్రత్యక్షంగా తమ భవిష్యత్తును పాడు చేసుకుంటూ పరోక్షంగా సంస్థ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారు. ఏసీబీకి చిక్కిన వారు ఆ తర్వాత అంతకంటే పెద్ద పోస్టుల్లో చేరుతుండటం గమనార్హం.

దరఖాస్తును బట్టి ధర

ఔటర్‌కు అటు ఇటుగా అనేక బహుళ అంతస్తుల భవనాలు, వాణిజ్య సముదాయాలు, పరిశ్రమలు, గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాలు వెలుస్తున్నాయి. కొత్త మీటర్లు, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ప్రతి నెలా 2,500 మంది దరఖాస్తు చేసుకుంటున్నారు. వీరిలో 250 మంది ప్యానల్ బోర్డుల కోసం, వందమంది వరకు డీటీఆర్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. భారీ బహుళ అంతస్తుల భవనాలకు హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, ఫైర్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ విభాగాల నుంచి ఎన్ఓసీలు తప్పనిసరి. ఆయా విభాగాల నుంచి అనుమతి తీసుకోకపోవడం, సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణాలు చేపడుతుండడం అక్రమార్కులకు కలిసి వస్తోంది. ప్యానల్ బోర్డు, ట్రాన్స్‌ఫార్మర్ మంజూరుకు రూ.రెండు లక్షలకుపైగా, వెంచర్‌లో కొత్తలైన్ల ఏర్పాటుకు రూ.ఐదు లక్షలకుపైగా డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం.

అక్రమ నిర్మాణాలకు అ'ధనం'గా..

ఇక భూదాన్, వక్ఫ్ బోర్డు, దేవాదాయశాఖ, అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో చేపట్టే నిర్మాణాలు కరెంటోళ్లకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ప్రత్యక్షంగా అక్రమ వసూళ్లకు పాల్పడుతుండటంతో పాటు పరోక్షంగా ప్రభుత్వ భూముల అన్యాక్రాంతానికి కారణమవుతున్నారు. తాజాగా మంచాల మండలంలోని ఓ వెంచర్‌లో రోడ్డుకు అడ్డుగా ఉన్న 11కేవీ, 33కేవీ లైన్ల మార్పునకు, నూతన ట్రాన్స్‌ఫార్మర్ మంజూరుకు సరూర్‌నగర్ సర్కిల్ ఎలక్ట్రికల్ (టెక్నికల్) డివిజనల్ ఇంజనీర్ (డీఈ) టి.రామ్మోహన్ డబ్బులు డిమాండ్ చేసి, సదరు కాంట్రాక్టర్ నుంచి రూ.18 వేలు తీసుకుంటూ ఇటీవల ఏసీబీకి పట్టుబడిన విషయం సంచలనం సృష్టించింది.

అక్రమార్కులను ఉపేక్షించబోం

క్షేత్రస్థాయిలోని ఇంజనీర్లు ఎవరైనా అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తాం. ఉద్దేశపూర్వకంగా ఫైళ్లను తొక్కిపెట్టి.. సకాలంలో కనెక్షన్లు జారీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం. అంతర్గత విచారణకు ఆదేశించడంతో పాటు పదోన్నతులు, పోస్టింగ్‌లు నిలిపివేస్తాం. భవిష్యత్తులో వారికి సంస్థ నుంచి రావాల్సిన బెనిఫిట్స్ విషయంలోనూ కోత విధిస్తాం.

– ముషారఫ్ ఫారూఖీ, సీఎండీ, టీజీఎస్పీడీసీఎల్



ఆమనగల్లు: గౌడసంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు

బోనం.. వైభవం

దప్పుల దరువులు.. శివసత్తుల పూనకాలు.. పోతరాజుల విన్యాసాలు.. నృత్యాల మధ్య శ్రావణ మాస బోనాలు పల్లెల్లో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆదివారం జిల్లాలోని పలుచోట్ల మహిళలు నెత్తిన బోనాలతో గ్రామ దేవతల ఆలయాలకు ఊరేగింపుగా తరలి వెళ్లారు. నైవేద్యాలు సమర్పించి పాడి పంటలతో చల్లంగ చూడాలని మొక్కుకున్నారు.



కందుకూరు: బోనంతో యువతి



యాచారం: తమ్మలోనిగూడలో బోనాలతో ఊరేగింపు



ఆమనగల్లు: బోనంతో యువతి

దూసుకొచ్చిన మృత్యు శకటం

- బైక్‌ను ఢీకొట్టిన లారీ
- తల్లీకూతుళ్ల దుర్మరణం

కొత్తూరు: మద్యం మత్తులో ఓ లారీ డ్రైవర్ వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపి తల్లి, కూతుళ్ల మృతికి కారణమయ్యాడు. ఈ విషాదకర సంఘటన కొత్తూరు మున్సిపల్ పరిధిలోని తిమ్మాపూర్ వద్ద జాతీయ రహదారిపై చేగూరు కూడలిలో చోటు చేసుకుంది. సీఐ నర్సింహారావు తెలిపిన వివరాల మేరకు.. షాద్‌నగర్ పట్టణంలో నివసిస్తున్న సాయికృష్ణ, భార్య కావ్య (25) కూతుళ్లు అనన్య (01), ఐశ్వర్య (03)తో కలిసి ఆదివారం బైకుపై హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. మార్గమధ్యలో తిమ్మాపూర్ వద్ద చేగూరు రోడ్డు కూడలిలోకి రాగానే అదే రూట్‌లో అతి వేగంగా, అజాగ్రత్తగా వెనుక నుంచి వచ్చిన లారీ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయికృష్ణ, ఆయన పెద్ద కూతురు ఎడమ వైపునకు పడిపోగా భార్య, చిన్న కూతురు అనన్య కుడివైపునకు లారీ చక్రాల కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో తల్లీ కూతుళ్లకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. లారీ అక్కడితో ఆగకుండా ముందు వెళ్తున్న మరో బైకు,



తల్లీ కూతుళ్ల మృతదేహాలు

ఆటో, టెంపో ట్రావెలర్‌ను ఢీకొట్టుకుంటూ ముందుకు వెళ్లింది. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు తల్లీకూతుళ్ల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన వారిని సమీపంలోని పీహెచ్‌సీకి తరలించారు. లారీ డ్రైవర్ మహ్మద్ పాషా మద్యం మత్తులో వాహనాన్ని నడపడంతోనే ప్రమాదం జరిగినట్లు సీఐ తెలిపారు. సాయికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

చదువు యాదయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలి

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: హెడ్ కానిస్టేబుల్ చదువు యాదయ్య ధైర్యసాహసాలు దేశంలోని అత్యున్నత రాష్ట్రపతి శౌర్యపతకానికి ఎంపిక చేసిందని.. ఆయనతో స్వగ్రామానికి, రాష్ట్రానికి గుర్తింపు వచ్చిందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని మీర్జాగూడలో మాజీ సర్పంచ్ భీమయ్య, గ్రామ యువకులు, పెద్దల ఆధ్వర్యంలో చదువు యాదయ్య దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలె యాదయ్య, డీసీసీ మాజీ అధ్యక్షుడు పి.వెంకటస్వామి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా దొంగలను పట్టుకొని పోలీస్‌శాఖకే గుర్తింపు తెచ్చారని కొనియాడారు. మన ప్రాంతానికి చెందిన వ్యక్తి దేశంలోని అత్యున్నత పతకానికి ఎంపిక కావడం గర్వకారణమన్నారు. యాదయ్యను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా యాదయ్య తన అనుభవాలు, గ్రామంతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. స్వగ్రామంలో, తండ్రి ముందు ఇలాంటి గౌరవం దక్కడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు డి. వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



హెడ్ కానిస్టేబుల్ యాదయ్య దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

విద్యారంగ పరిరక్షణకు కృషి

టీఎల్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరుణాకర్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో విద్యారంగ పరిరక్షణకు తెలంగాణ లెక్చరర్స్ ఫోరం (టీఎల్ఎఫ్) నిబద్ధతతో పని చేస్తుందని ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.కరుణాకర్ అన్నారు. విద్యారంగ సమస్యలపై ఈ నెల 27న మహబూబ్‌నగర్‌లోని వీవీ కన్వెన్షన్ హాలులో సదస్సు నిర్వహించనున్నారు. పట్టణంలోని టీఎల్ఎఫ్ కార్యాలయంలో ఫోరం రాష్ట్ర కార్యదర్శి మశ్చేందర్ ఆధ్వర్యంలో ఆదివారం సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగ సంస్కరణలు, సమస్యల పరిష్కారానికి విద్యారంగ నిపుణులు, మేధావులు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. మిషన్ ఎడ్యుకేషన్ తెలంగాణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యా వ్యవస్థపై సమాలోచనలు చేసేందుకు విద్యా సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ క్రమంలో మొదటి సదస్సును పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని మహబూబ్‌నగర్‌లో నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 27న ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే సదస్సుకు ముఖ్యఅతిథులుగా మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి, టీఎల్ఎఫ్ రాష్ట్ర చైర్మన్ కత్తి వెంకటస్వామి, అధ్యక్షుడు రామకృష్ణయ్య, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారని వెల్లడించారు. సదస్సుకు మేధావులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు, విద్యా సంస్థల యాజమాన్యాలు, నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఎల్ఎఫ్ జిల్లా కార్యదర్శి శేఖర్, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు మల్లేశ్‌గౌడ్, నాయకులు పాండు, ఆంజనేయులు, వంశీ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న టీఎల్ఎఫ్ నాయకులు

చెరువులను కాపాడాలి

- నినదించిన గండిపేట వెల్ఫేర్ సొసైటీ
- హైడ్రాకు మద్దతుగా గండిపేట కట్టపై వాక్
- తరలివచ్చిన విద్యార్థులు, విశ్రాంత ఉద్యోగులు

మణికొండ: చెరువులను కాపాడాలి.. హైడ్రా ముందుకెళ్లాలి.. హైదరాబాద్ మనది.. హైడ్రా మనందరిదీ.. మనమంతా చెరువులను కాపాడుకోవాలి.. అంటూ గండిపేట వెల్ఫేర్ సొసైటీ, సీబీఐటీ, ఎంజీఐటీ, వివిధ పాఠశాలల విద్యార్థులు, విశ్రాంత ఉద్యోగులు నినదించారు. ఉస్మాన్‌సాగర్ (గండిపేట) చెరువు కట్టపై హైడ్రాకు మద్దతుగా వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు రాజశ్రీ, వేణుగోపాల్, సంస్కృత, శ్రీలత, అన్విత మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరంలో నిజాం నవాబు మనకు 7 వేల శుద్ధి నీటి చెరువులు నిర్మించి ఇస్తే మనం వాటిని 70కి తగ్గించి మురికి కూపాలుగా మార్చామన్నారు. వాటికి తిరిగి పూర్వ వైభవం తేవాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించి హైడ్రాను ఏర్పాటు చేసి అక్రమ నిర్మాణాలను కూల్చివేయడం శుభ పరిణామం అని పేర్కొన్నారు. ఎంతటి ఒత్తిడి వచ్చినా హైడ్రా పనులను ఆపవద్దని, హైదరాబాద్ నగర ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించిన గండిపేట, హిమాయత్‌సాగర్‌లను బతికించాలని కోరారు.



గండిపేట కట్టపై హైడ్రాకు మద్దతుగా వాక్‌లో పాల్గొన్న విద్యార్థులు, గండిపేట వెల్ఫేర్ సొసైటీ సభ్యులు



హైడ్రాకు మద్దతుగా వాక్‌లో పాల్గొన్న విద్యార్థులు

రిజర్వేషన్ల కల్పనకు మండల్ కృషి

షాబాద్‌లో బీపీ మండల్ జయంత్యుత్సవం



మండల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

షాబాద్: వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్ కల్పించేందుకు బాబు బింధేశ్వరి ప్రసాద్ మండల్ ఎంతో కృషి చేశారని బీసీ సేనజాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్, తెలంగాణ ప్రజా చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాపోల్ నర్సింహులు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద బీపీ మండల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెనుకబడిన వర్గాలకు సంబంధించిన విధానాలపై ఆయన చేసిన సేవలను కొనియాడారు. భారత రాజకీయాల్లో తక్కువ ప్రాతినిధ్యం లేని, వెనుకబడిన వర్గాలకు సంబంధించిన విధానాలపై తీవ్ర చర్చను ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో కురుమ సంఘం మండల అధ్యక్షుడు పాండు, కోశాధికారి జంగయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్, తెలంగాణ చైతన్య సమితి ఉపాధ్యక్షుడు వితలయ్య, బీసీ సేన రాష్ట్ర కార్యదర్శి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ రహదారికి అడుగులు

- వెంకటాపూర్–చందానగర్ రోడ్డును సర్వే చేసిన అధికారులు
- స్థానిక నేతల వినతికి స్పందించిన మంత్రి కోమటిరెడ్డి



రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

మొయినాబాద్: గ్రామీణ రోడ్డును ఆర్‌అండ్‌బీ రహదారిగా మార్చేందుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. మండల పరిధిలోని వెంకటాపూర్–చందానగర్ దారిని ఆర్‌అండ్‌బీ రోడ్డుగా మార్చేందుకు ఆదివారం అధికారులు సర్వే చేపట్టారు. శనివారం మొయినాబాద్ మండలానికి వచ్చిన రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి స్థానిక నాయకులు వినతిపత్రం అందజేశారు. శంషాబాద్–షాబాద్ రోడ్డులోని కవేలిగూడ నుంచి వెంకటాపూర్, శ్రీరాంనగర్, సురంగల్, మొయినాబాద్, పెద్దమంగళారం గ్రామాల మీదుగా హిమాయత్‌నగర్–తంగడ్‌పల్లి రోడ్డులోని చందానగర్ గేటు వరకు ఉన్న పంచాయతీరాజ్ రహదారిని ఆర్‌అండ్‌బీ రోడ్డుగా మార్చాలని స్థానిక నాయకులు మంత్రికి విన్నవించారు. వెంటనే స్పందించిన మంత్రి కోమటిరెడ్డి రోడ్డును పరిశీలించి సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఆదివారం ఆర్‌అండ్‌బీ ఎస్‌సీ వెంకటేశ్వరావు, జేసీ చంద్రశేఖర్ మొయినాబాద్‌కు వచ్చారు. వెంకటాపూర్ చౌరస్తా నుంచి చందానగర్ చౌరస్తా వరకు 16 కిలోమీటర్లు సర్వే నిర్వహించారు. మంత్రి కోమటిరెడ్డి వెంటనే స్పందించి రోడ్డు సర్వే చేయించడంతో స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆర్‌అండ్‌బీ అధికారుల వెంట పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాణయ్య, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు రాంరెడ్డి, మాధవరెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, విజయ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చుక్కాపూర్‌లో బ్యాటరీల చోరీ

తలకొండపల్లి: వాహనాల్లో ఉన్న బ్యాటరీలను దుండగులు అపహరించిన సంఘటన మండల పరిధిలోని చుక్కాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. శనివారం రాత్రి గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్‌లో ఒక బ్యాటరీ, గండికోట వెంకటయ్యకు చెందిన ఒక బ్యాటరీతో పాటు పలువురికి చెందిన ఆరు బ్యాటరీలను దుండగులు చోరీ చేశారు. వీటి విలువ రూ.లక్షకు పైమాటే ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా రామస్వామి



చేవెళ్ల: సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా చేవెళ్లకు చెందిన కె.రామస్వామి ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆయన మండల కేంద్రంలో విలేకర్లతో వెల్లడించారు. ఈనెల 22 నుంచి 24 వరకు హన్మకొండలో జరిగిన సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో తనను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారన్నారు. పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. పార్టీలో ఏన్నో ఏళ్లుగా వివిధ స్థాయిలు, హోదాల్లో పనిచేస్తూ కార్మిక, కర్షక, ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్నానన్నారు. తన ఎన్నికకు కృషి చేసిన రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులను ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అంబేడ్కర్ జాతీయ అవార్డుకు ప్రదీప్ ఎంపిక



ప్రదీప్‌కి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న రాధాకృష్ణ

చేవెళ్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డుకు మండలంలోని ఇబ్రహీంపల్లి గ్రామానికి ఎ.ప్రదీప్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం నగరంలోని బహుజన సాహిత్య అకాడమీ(బీఎస్‌ఏ) కార్యాలయంలో ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ ప్రకటించారు. అంబేడ్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్న ప్రదీప్ సేవలను గుర్తించి అవార్డు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ.. మహనీయులు చూపించిన మార్గాలు అందరికీ ఆదర్శంగా నిలుస్తాయన్నారు. బాబాసాహెబ్ ఆశయ సాధనకు కృషి చేస్తానన్నారు. బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఏటా వివిధ రంగాల్లో సేవలందించిన వారిని ఎంపిక చేసి ఈ అవార్డులు ఇస్తారన్నారు. వీటిని సెప్టెంబర్‌లో తిరుపతిలో ప్రదానం చేస్తారన్నారు. ఈ మేరకు ప్రదీప్‌ను గ్రామానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ మధుసుదన్‌రెడ్డి, పలువురు నాయకులు అభినందించారు.

పంచాయతీలకు నిధుల గండం

జీపీలకు నిలిచిన కేంద్ర, రాష్ట్ర ఫండ్స్

- ఆరు నెలల నుంచి ప్రత్యేకాధికారుల పాలన
- అప్పులు చేసి పనులు చేయిస్తున్న కార్యదర్శులు
- బిల్లులు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు



సర్దార్‌నగర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

షాబాద్: నిధులు లేక గ్రామ పంచాయతీల పాలన ఇబ్బందుల్లో పడింది. గత ఫిబ్రవరి నుంచి పంచాయతీల్లో పాలక వర్గాల కాల పరిమితి పూర్తయి ప్రత్యేక అధికారుల పాలనలోకి వెళ్లింది. ఎన్నికలు నిర్వహించక ఆరు నెలలు దాటడంతో కేంద్ర నిధులు నిలిచిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులు ఇవ్వకపోవడంతో పంచాయతీల్లో చిన్నపాటి బల్బులు వేయాలన్నా, పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నా కార్యదర్శులే సొంతంగా డబ్బులు పెట్టుకోవాల్సి పరిస్థితి నెలకొంది. ఆరు నెలలుగా ఒక్కో కార్యదర్శి పంచాయతీ సామర్థ్యాన్ని బట్టి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో జిల్లాలో 558 గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఆరు నెలలుగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆగిన ఆర్థిక సంఘం నిధులు

పంచాయతీల పాలక వర్గాల కాలపరిమితి ఫిబ్రవరి 2తో పూర్తయింది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల ముందు నుంచే ఆర్థిక సంఘం నిధులు రావడం లేదు. కొత్తగా ఏర్పడ్డ రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధుల మంజూరుకు చొరవ చూపలేదు. కేంద్ర నిధులు రావాలంటే గ్రామ పంచాయతీలకు పాలక వర్గాలుండాలి. ఆరు మాసాల నుంచి ప్రత్యేక అధికారుల పాలన కారణంగా రెండు ప్రభుత్వాల ఆర్థిక సంఘం నిధులు రావడం లేదు.

సొంత డబ్బులతో పారిశుద్ధ్య పనులు

గ్రామాల్లో సర్పంచ్‌లు ఉన్నప్పుడు నిధులు రాకున్నా సొంతంగా డబ్బులు వెచ్చించి పారిశుద్ధ్య, వీధి దీపాలు ఇతర పనులు చేయించేవారు. కానీ ప్రత్యేక అధికారుల పాలన రావడంతో కార్యదర్శులే ఆయా పనులకు సొంతంగా డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోంది. బిల్లులు రాకపోవడంతో కార్యదర్శులు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు.

సర్పంచులదీ అదే పరిస్థితి

గత పాలకవర్గానికి సంబంధించిన సర్పంచ్‌లు అప్పటి ప్రభుత్వం చేపట్టిన వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, హరితహారం మొక్కలు తర్వాత క్రీడా ప్రాంగణాలు తదితర పనులు చేపట్టారు. వాటి బిల్లులు సక్రమంగా రావడం లేదని కాంట్రాక్టర్లు రాని చోట సర్పంచ్‌లే సొంతంగా పనులు చేయించారు. చాలా మంది సర్పంచులు రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వెచ్చించారు. ఆ బిల్లులు కూడా ఇప్పటి వరకు రాలేదని వాపోతున్నారు.

అన్నీ సమస్యలే



ప్రత్యేక అధికారుల పాలనలో సమస్యలు ఎక్కువయ్యాయి. తాగు నీరు సరిగ్గా రావడం లేదు. ఎల్‌ఈడీ లైట్లు మరమ్మతు చేయించకుండా చిన్నచిన్న బల్బులు వేస్తున్నారు. ఇదేంటని అధికారులను అడిగితే నిధుల కొరత అని చెబుతున్నారు.

– మహేశ్, కుర్వగూడ, షాబాద్

పట్టించుకోవడం లేదు



ప్రత్యేక అధికారుల పాలనలో పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదు. మా వార్డులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. షాబాద్‌లో చెత్త ట్రాక్టర్ మూడు రోజులకు ఒకసారి వస్తుంది. దోమల నివారణకు మందులు పిచికారీ చేయడం లేదు.

– రవీందర్‌గౌడ్, షాబాద్

బిల్లులు పెండింగ్



గ్రామ అభివృద్ధికి ఐదేళ్లలో రూ.5 లక్షల నిధులు ఖర్చు చేశా. ఈ నిధులను అంగన్‌వాడీ భవనం, డ్రైనేజీ నిర్మాణం, రహదారుల ఏర్పాటు, క్రీడా ప్రాంగణం, విద్యుత్ బిల్లుల చెల్లింపునకు వినియోగించాను. బిల్లులు పెండిగ్‌లో ఉన్నాయి.

– రాములు, మాజీ సర్పంచ్, రేగడిదోస్వాడ

అవస్థలు పడుతున్నాం



సర్దార్‌నగర్ గ్రామంలో అభివృద్ధి కోసం రూ.20 లక్షలు అప్పు చేసి ఖర్చు చేశా. ఈ డబ్బుతో డ్రైనేజీలు, సీసీ రోడ్లు, మరుగుదొడ్ల నిర్మాణానికి ఖర్చు చేశా, పదవీకాలం ముగిసి ఆరు నెలలు కావొస్తున్నా పెండింగ్ బిల్లులు రావడం లేదు.

– స్వరూప, మాజీ సర్పంచ్, సర్దార్‌నగర్

ప్రభుత్వాలు కఠిన చట్టాలను ప్రవేశపెట్టాలి



మైలార్‌దేవ్‌పల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న అఖిల భారత మహిళా సాంస్కృతిక సంఘం సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: కోల్‌కతాలోని ఆర్జీకార్ ఆసుపత్రి జూనియర్ వైద్యురాలు హత్యాచారానికి గురైన ఘటనను ఖండిస్తూ ఆదివారం మధుబన్ కాలనీలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏఐఎంఎస్‌ఎస్ రాష్ట్ర నాయకురాలు హేమలత మాట్లాడుతూ.. మెడికల్ విద్యార్థిని పై జరిగిన ఘటన అనుకోకుండా జరిగినది కాదని పథకం ప్రకారమే జరిగిందని ఆమె అన్నారు. ఈ సంఘటనలో అనేక కోణాలు మన ముందుకు వస్తున్నాయని, నిజాలను తేల్చి దోషులకు కఠిన శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలను ప్రవేశపెట్టాలని కోరారు. అత్యాచారాలకు ప్రధాన కారణం మద్యం, మాదకద్రవ్యాలు, ఇంటర్‌నెట్‌లో వస్తున్న అసాంఘిక వీడియోల ద్వారానే యువత పెడదారిన పడుతున్నారని, వాటిని వెంటనే బ్యాండ్ చేసి దేశ మహిళలను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు వజ్రమ్మ, శైలజ, స్వరూపా, భారతి తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



ల్యాంకోహిల్స్‌లో ర్యాలీలో పాల్గొన్న నివాసితులు

మణికొండ: కోల్‌కతాలో డాక్టర్‌పై లైంగిక దాడికి పాల్పడి హత్య చేసిన నిందితులను వెంటనే శిక్షించాలని ల్యాంకోహిల్స్ వాసులు డిమాండ్ చేశారు. శనివారం రాత్రి నివాసితులు కొందరు ప్లేకార్డులను పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు ప్రభుత్వాలు, కోర్టులు తక్షణ కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాలతో పాటు ప్రజలకు న్యాయం అందించాలన్నారు. ఘటన జరిగి ఇన్ని రోజులైనా ఇప్పటి వరకు ఎవరు విచారణ చేయాలి, ఏ కోర్టులో పెట్టాలనే ఆలోచనలోనే ఉండటం ఏంటి అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇకనైనా ప్రభుత్వాలు, కోర్టులు స్పందించి వెంటనే న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు.

కళ్లలో కారం చల్లి.. లూటీ

రూ.1.20 లక్షలు అపహరణ

మొయినాబాద్: కూల్‌డ్రింక్స్ సప్లయ్ చేసే యువకుల వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు అడ్డగించి కళ్లలో కారంపొడి చల్లి నగదు దోచుకెళ్లారు. ఈ సంఘటన మండల పరిధిలోని సురంగల్– కనకమామిడి మార్గమధ్యలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాపులకు కూల్‌డ్రింక్స్ సప్లయ్ చేసే ఇద్దరు యువకులు మహ్మద్ ఈసా, భరత్‌కుమార్ శంషాబాద్‌లోని గోదాం నుంచి వాహనంలో కూల్‌డ్రింక్స్ తీసుకుని మొయినాబాద్ మండలం సురంగల్‌లోని షాపుల్లో సరఫరా చేశారు. అక్కడి నుంచి కనకమామిడి వెళ్తుండగా మార్గమధ్యలో గుర్తుతెలియని వ్యక్తులు వాహనాన్ని అడ్డగించి ఇద్దరి కళ్లలో కారం పొడి చల్లారు. రాళ్లతో వారిపై దాడి చేసి వారి వద్ద ఉన్న బ్యాగును లాక్కుని పారిపోయారు. బ్యాగులో రూ.1.20 లక్షలు ఉన్నాయి. కారం పొడి మంటలు చల్లారిన తరువాత బాధితులు మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గోల్కొండ కోటకు పర్యాటకుల తాకిడి

గోల్కొండ: చారిత్రక కట్టడమైన గోల్కొండ కోటకు పర్యాటకులు పోటెత్తారు. వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో ఆదివారం పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కోటలోని ఆయుధాగారం, క్లాపింగ్ పోర్టిపో వద్ద గల ఫిరంగి వద్ద పర్యాటకులు సెల్ఫీలు దిగారు. అంతేగాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులు నగీనా బ్యారెక్స్‌లోని రహస్య గదులను సందర్శించారు. శ్రీరామ భక్తులు కోట ఎగువ భాగంలో గల భక్త రామదాసు చెరసాలను చూసి పరవశులయ్యారు.

పేకాట ఆడుతున్న 20 మంది అరెస్టు

మణికొండ: ఓ అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌లో గుట్టు చప్పుడు కాకుండ పేకాట ఆడుతున్న 20మందిని నార్సింగి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పుప్పాలగూడలోని కంట్రీ ఫాం అపార్ట్‌మెంట్స్‌లోని ఫ్లాట్ నెంబర్ 501లో కొంత మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావటంతో పోలీసులు దాడులు చేశారు. ఫ్లాట్‌లో ఏకంగా 20 మంది పేకాట ఆడుతున్నట్లు గుర్తించి వారిని అరెస్టు చేశామన్నారు. అరెస్టు చేసిన వారిలో చేవెళ్ల, మొయినాబాద్ మండలాలకు చెందిన కనకమామిడి మల్లారెడ్డి, విజయ్ భాస్కర్‌రెడ్డి, వెంకటరెడ్డి, కృష్ణారెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, కె.మల్లారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాంరెడ్డి, జైపాల్‌రెడ్డి, విటల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, వెంకటరెడ్డి, జంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, అనంతరెడ్డి, బల్వంత్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి ఉన్నారు. వీరి వద్ద నుంచి రూ.1.56.910 నగదు, 20 సెల్‌ఫోన్లు, ఆరు కార్లను సీజ్ చేశారు. ఎస్‌ఐ ప్రభాకర్ ఫిర్యాదుతో శనివారం రాత్రి కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. వీరికి వాసు అనే వ్యక్తి తన ఫ్లాట్‌ను పేకాట ఆడేందుకు ప్రతి రోజు రూ.5 వేలు అద్దెకు ఇస్తున్నట్టు వారు అంగీకరించినట్టు పోలీసులు వివరించారు.

సాగుపై రైతులకు అవగాహన

శంషాబాద్ రూరల్: మండలంలోని గండిగూడలో ఆదివారం భాటీ వ్యవసాయ క్షేత్రంలో బహుళ పంట సాగు విధానంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు ఆధునిక సాగు పద్ధతులతో పాటు లాభదాయక పంటలపై దృష్టి పెట్టాలని సర్వోదయ మండలి కార్యదర్శి శ్రీనివాస్ సూచించారు. దీర్ఘ, స్వల్పకాలిక పంటలను ఒకే చోట పండించడం ద్వారా ఆదాయం సమకూర్చే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. మహాగణి, ఆవకాడు, మునగ, బీర, దొండ, అల్లం పంటలను ఒకే చోట సాగు చేస్తున్న విధానాన్ని రైతులకు వివరించారు. కలుపు నివారణ కోసం మల్చింగ్ షీట్, డ్రిప్‌తో సాగుకు నీరు అందించడంతో కూలీల ఖర్చు, తక్కువ నీటి అవసరం ఉంటుందని పేర్కొన్నారు. ఇక్కడ సాగు చేస్తున్న జెరేనియం సుగంధ పంట సాగు విధానాన్ని తెలియజేశారు. క్షేత్రం నిర్వాహకులు బన్‌కట్ లాల్ భాటీ, రైతులు రాజశేఖర్, వివిధ మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

దొరికితేనే దొంగ!

- వే బిల్లులు లేకుండా ఐరన్ లోడ్‌తో రోడ్డుపైకి ట్రక్కు
- పోలీసులు పట్టుకున్న గంటన్నర తర్వాత జీఎస్టీ చెల్లింపు
- నందిగామలో ఆదివారం ఘటన
- వెలుగులోకి రానివి మరెన్నో..



డ్రైవర్‌తో మాట్లాడుతున్న పోలీసు

నందిగామ: జీఎస్టీ లేకుండా ఓ ట్రక్కు రూ.లక్షలు విలువ చేసే ఇనుప సామగ్రితో వెళ్తోంది. అంతేకాకుండా పరిమితికి మించి లోడ్ వేసుకొని రోడ్డుపైకి ప్రమాదకరంగా ఇనుప రాడ్లను వేలాడదీస్తోంది. ఈ క్రమంలో రహదారిపై అడ్డగోలుగా పార్క్ చేయగా.. విషయం తెలిసిన పోలీసులు ట్రక్కు ఎక్కడి నుంచి వస్తుంది. రోడ్డుపై ఎందుకు పార్క్ చేశారు.. తదితర వివరాలను ప్రశ్నించగా ఆ వాహన డ్రైవర్ ఉక్కిరిబిక్కిరి అయ్యారు. సదరు డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లిన గంటన్నర తర్వాత ఆందోళన చెందిన సదరు యజమాని హుటాహుటిన రూ.2.83 లక్షలు ఆన్‌లైన్‌లో చెల్లించి అన్ని పేపర్లు ఉన్నాయని ఠాణాలో సమర్పించారు. ఇదీ నందిగామ మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. ఇదే తరహా ఘటనలు నిత్యకృత్యంగా జరుగుతున్నాయి.

పైరవీలు విఫలం

స్థానిక అంతిరెడ్డిగూడ రోడ్డులో ఉన్న ఓ ఐరన్ పరిశ్రమ నుంచి మండల కేంద్రమైన నందిగామ పాత జాతీయ రహదారి పక్కన తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు ఓ ఐరన్ రాడ్లతో ఉన్న ట్రక్కు వచ్చింది. ఆ ట్రక్కు వేబ్రిడ్జి నుంచి నేరుగా షాద్‌నగర్ వైపునకు మళ్లించి రోడ్డుపై అడ్డగోలుగా నిలిపివేశారు. ఆ ట్రక్కులో ఉన్న ఐరన్ రాడ్లు రోడ్డుపైకి సుమారు 10 ఫీట్లు వెనకాల ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో స్థానిక పోలీసులు రోడ్డుపై వాహనాన్ని ఎందుకు నిలిపారని, ట్రక్కులో ఐరన్ రాడ్లు రోడ్డుపైకి వచ్చే విధంగా ఎందుకు లోడ్ చేశారని ప్రశ్నించారు. అంతే కాకుండా వే బిల్లులు ఉన్నాయా అని ప్రశ్నించగా లేవని డ్రైవర్ సమాధానం ఇచ్చాడు. పోలీసులు ట్రక్కును పట్టుకున్నారనే విషయం తెలిసిన సదరు యజమాని చేయాల్సిన పైరవీలు చేసి విఫలమయ్యాడు. ఎట్టకేలకు సాయంత్రం నాలుగు గంటలకు రూ.2.83 లక్షలు జీఎస్టీగా ఆన్‌లైన్‌లో చెల్లించారు. అనంతరం మా పేపర్లను సమర్పించి ట్రక్కును విడిపించుకున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

ఏదైన పారిశ్రామిక ఉత్పత్తులు తీసుకెళ్లాలంటే తప్పని సరిగ్గా అందుకు సంబంధించిన రసీదులు ఉండాలి. జీఎస్టీ తప్పనిసరిగా ఉండాలి. అవి లేకుండా రోడ్లపైకి ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు రాకూడదు. కానీ నందిగామ పారిశ్రామికవాడలో నిత్యం ఇలాంటి వాహనాలు యథేచ్ఛగా తిరుగుతూ, ప్రభుత్వానికి రావాల్సిన రూ.లక్షల ఆదాయానికి గండి కొడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జీఎస్టీ చెల్లింపుల విషయంలో కఠినచర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

చర్యలు తీసుకుంటాం

నిర్లక్ష్యంగా వాహనాన్ని నిలపడమే కాకుండా ప్రమాదకరంగా ఐరన్‌రాడ్లు రోడ్డుపైకి వచ్చే విధంగా లోడ్ చేసిన విషయమై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. జీఎస్టీ విషయానికి వస్తే సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చాం.

– గోపాలకృష్ణ, ఎస్సై, నందిగామ

వే బిల్లులు తప్పనిసరి

పరిశ్రమలలోని ఉత్పత్తులను తీసుకెళ్లే వాహనాలకు సంబంధిత పేపర్లు లేకుండా రోడ్లపైకి రాకూడదు. నందిగామలో పోలీసులకు పట్టుబడ్డ ట్రక్కు మొదట జీఎస్టీ చెల్లించలేదు. విచారణ అనంతరం జీఎస్టీ చెల్లించారు. ఆ సమయంలో జీఎస్టీ అధికారులు నేరుగా పట్టుకున్నట్లయితే వెంటనే తమ వద్ద ఉన్న యాప్ ద్వారా చెక్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంది. ప్రస్తుతం జీఎస్టీ చెల్లించారు.

– వెంకటయ్య, జీఎస్టీ అధికారి